# ఓహ్హో! నా పెళ్ళామా!

ఎం. విద్యుల్లత

"కుశాలీ! కుశాలీ!"... పిలుపులతో పాటుగా దబదబ తలుపులు బాదుతున్న శబ్దం.

"ఓయ్! వస్తున్నా. తలుపులెందుకూ అలా బాదుతారూ?" అంటూ విసుగ్గా వచ్చి తలుపు తీసింది కుశాలి.

లోపలకు అడుగుపెడ్తూ- "అబ్బ! ఎండ, ఎండ- కాస్త చల్లని నీరిలా ఇవ్వు" వుస్సురుమంటూ పడక్కుర్చీలో జారగిలపడ్డాడు. అంతలోనే ఎగిరి గంతేసినంత పన్చేసి "ఏమిటి మామిడిపళ్ళు కొన్నట్లున్నావే" అన్నాడు చాటంత ముఖం చేసుకుని చిన్న పిల్లవాడిలా సంబరపడిపోతూ.

మంచినీళ్ళగ్లాసు చేతికందిస్తూ- "అవును కె.జి. నాలుగు రూపాయలకు కొన్నాను" అంది.

"అబ్బ! ఇంత పెద్ద పళ్ళు- పది రూపాయలకైనా కొనేయవచ్చు" అన్నాడు.

"మీరైతే అలాగే కొనేసి వుందురు. ఐదురూపాయలు చెప్తే నాలుక్కి బేరమాడాను. సరేలేగానీ- ఇప్పుడే వస్తాను. జానకమ్మగారు ఎందుకో పిల్చారు." అంటూ బైటకు వెళ్ళిన కుశాలి పదినిమిషాలలో వెనక్కు వచ్చింది ఆమె లేనందున.

రాగానే భర్త చేస్తున్న పని చూసి- "ఆగండాగండి!" అంటూ గట్టిగా అరచింది.

అది ఒక సన్నమూతి కూజా బిందె. సగం వరకూ నీళ్ళున్నాయి. ఆమె భర్త శంకరం ఆ మామిడిపళ్ళను బలవంతంగా ఆ బిందెలోకి నెట్టుతున్నాడు.

"ఏం పనండీ ఇది. ఎందుకిలా చేస్తున్నారు?" కోపంగా అడిగింది.

"ఎందుకేమిటి? ఎండలో కొన్నావేమో- వేడిగా వున్నాయి పళ్ళు. తినేముందు నీళ్ళలో కాసేపు వుంచి తింటారు గదా- ఆ బక్కెట్టులో నీళ్ళు లేవు, దీంట్లో వున్నాయి. వేస్తున్నాను అంతే-"

"బాగుంది వరస. ఇంత బలవంతంగా నెడుతున్నారు కదా! మళ్ళా ఎలా తీసుకుంటాం?"

"జానోయ్ నిజమే సుమా... నాకు తట్టనేలేదు."

"పోనీ ఆ నీళ్ళు బక్కెట్లో పోసి కాయలు వేయలేకపోయారా?"

"అరె నాకు తోచలేదన్నానా?" అలా నిలబడిపోయాడు భర్త.

దూరినంతమట్టుకు చాకుతో కోసి ఆ కాయ బయటకు తీసింది కుశాలి.

* ** *

వాలుకుర్చీలో పడుకుని వారపత్రికలో 'వారఫలాలు' చూసుకుంటున్నాడు శంకరం.

"అమ్మయ్య! వున్నారో-లేరో అనుకుంటూ వచ్చా-" అంటూ ప్రవేశించాడు సాంబయ్యగారు.

"ఆ... రండి... రండి... రండి... కూర్చోండి ఇవాళ తీరిగ్గా వున్నట్లున్నారే"

"తీరికా- నా మోహమా! ఆఫీసరుగారికి ఆవకాయ పెట్టేందుకు మామిడికాయలు తెచ్చిపెట్టాలట. పక్కవూరెళ్తున్నా. మా ఇంటిది సినిమాకెళ్ళింది. ఇవిగో తాళం చెవులు కాస్త వచ్చాక ఇవ్వండి. బస్సుకు టైమవుతోంది, మళ్ళా కలుద్దాం" అంటూ తాళాలు అందించేసి చకచకా వెళ్ళిపోయాడా పెద్దమనిషి. మాట్లాడుతున్నంతసేపు బ్రాందీ వాసనే.

లోపల్నుంచి ఇదంతా వింటూనే వుంది కుశాలి.

ఇంతలో జానకమ్మగారొచ్చి "అమ్మాయ్ కుశలమ్మా ఒక్కమాటు ఇలారా" అంటూ పిల్చుకెళ్ళింది.

అర్ధగంట తర్వాత ఇల్లు చేరిన కుశాలికి ఇంట్లో భర్త కనిపించలేదు. తలుపులైనా చారవేయకుండా ఎక్కడికెళ్ళారు చెప్మా అనుకుంటూ అటూ ఇటూ చూసేసరికి ప్రక్క వాటా తలుపులు తీసి, వాళ్ళ కుర్చీలో సుఖాసీనుడై అర్ధనిమీలితనేత్రాలతో మందు సేవిస్తున్న భర్త కనిపించాడు. మతిపోయినంత పనై ఒక్క అంగలో ప్రక్కవాటాలోకెళ్ళి చూసింది. సాంబయ్యగారు ఎంత జాగ్రత్తగా దాచుకున్నారో ఏమో- ఖరీదైన విస్కీ... అది అందిపుచ్చుకుని నీళ్ళలో కలుపుకుంటూ సేవించి మత్తులో మునిగిపోయిన భర్త!

"అయ్యో! అయ్యో! ఎంతపని చేశావయ్యా మగడా! వాళ్ళొచ్చేస్తారు. ఆవిడగారికివ్వమని తాళాలిస్తే మీరు చేసిన ఘనకార్యం ఇదా! త్వరగా లేవండి"-ఇంచుమించు ఈడ్చుకెళ్ళినట్లుగా భర్తని ఇంట్లోకి తీసికెళ్ళి కూలేసింది. ఆ ఖాళీ సీసాను అల్మారా దగ్గరగా పగలగొట్టి ఆ ముక్కలు గబగబా కాసిని టీ డికాక్షను తీసి ఆ గాజు పెంకుల మధ్య పోసి ఇంటికి తాళంవేసి వచ్చి కూచుంది గుండెలు దడదడలాడుతుంటే. ఆ సీసా ఎలాగో పడి పగిలి ఆ విస్కీ నేలపాలైనట్టుగా వాళ్ళు అనుకోవాలి. ఈ మనిషితో నాకెన్ని చిక్కులో భగవంతుడా అను కుంది

మరో అర్ధగంటకి ఆండాళ్ళమ్మగారు వచ్చి తాళాలు తీసుకోవడం, పడి పగిలిన సీసాని చూసి పిల్లిని, ఎలకల్ని, మొగుడ్ని కాసేపు తిట్టి గది శుభ్రం చేకోవడం అంతా గమనించి- నిట్టూర్చింది కుశాలి.

* ** *

రెండోరోజు సాంబయ్యగారు వచ్చారు. బస్సు ప్రయాణాలు, ఆవకాయ బేరాలు, ఆఫీసరుగారు, అలసట, మందు వరకూ మాట్లాడుకుంటున్నారు. అంతా వింటూ బియ్యం ఏరుకుంటున్న కుశాలికి సంభాషణ ఎటు తిరిగి ఎటు వస్తుందోనని జాగ్రత్తగా వింటోంది.

"బంగారంలాంటి స్కాచయ్యా! వెధవ పిల్లి తన్నేసి అంతా నేలపాలైంది. అప్పుడప్పుడూ ఓ చుక్క నాలిక్కి తడుపుకుంటుంటాను. నిన్నంతా మా ఆవిడ సణుగుడు..."

"మీ ఇంట్లోది కదండీ - నిజంగా బంగారం అండీ - - - -"

గుండె గుభేలుమంది కుశాలికి. భర్త అంతా చెప్పేయబోతున్నాడని అర్థమైపోయింది.

వంటగదిలో నుండి ధనామని శబ్దమూ, కెవ్వున కేక విన పడటంతో శంకరం నోటికి తాళం పడటమే గాక, ఆ శబ్దానికి సాంబయ్యగారికి శంకరం చెప్తున్నవి సరిగ్గా వినపడలేదు కూడా.

"ఏమైంది? ఏమైంది?" అంటూ వచ్చేశారు వెంటనే.

"కందిపప్పు డబ్బా పై నుండి తీయబోతుంటే జారి కాలిమీద పడింది" బాధతో చెప్పింది కుశాలి, పాదాన్ని అరచేతుల్లో దాచుకుని!

"అయ్యయ్యో... వెంటనే తడిగుడ్డ చుట్టమ్మా. డాక్టరుగారి దగ్గరకి తీసుకెళ్ళవయ్యా శంకరం" అంటూ ఉచిత సలహాలు మరి నాలుగు పారేసి, వక్కాపోయాడాయన.

అప్పుడు అపరకాళిలా లేచింది కుశాలి.

"నీకు నిజంగా బుద్ధుందా లేదా? మీరు తాళం ఇస్తే మీ ఇంట్లో జొరబడి మీ విస్కీ అంతా దొంగతనంగా తాగేశానూ- చాలా బాగుందీ" అని చెప్పబోతున్నావు కదూ!" (అమిత కోపం వస్తే 'మీరు' అనదు.)

"ఛ ఛ అంత బుద్ది లేదనుకున్నావా ఏమిటి? 'అదంతా' ఎందుకు చెప్తానూ? మీ విస్కీ రుచి చాలా బాగుందీ అంటున్నానంతే!"

"ఎలా తెల్సు దాని రుచి తాగందే? తాగారూ అంటే తాళాలు తీసుకుని దొంగతనంగా జొరబడి సీసా కాజేసి తాగితేనేకదా దాని రుచి తెలిసేది. ఎందుకయ్యా, "ళ్ళు రాగానే సరా."

చకచకా నడుస్తున్న భార్య కాళ్ళని ఆశ్చర్యంగా చూస్తూ- "అది సరే- నీ కాలికి దెబ్బేదీ-?"

"ఆ! మీ మూలంగా నేను దెబ్బ తగిలించుకుంటానా? నీ నోరు మూయించాలనీ ఆ డబ్బా నేలకేసి కొట్టి అలా కేకపెట్టా- లేకుంటే ఈ పాటికి నీవు అంతా చెప్పేయడం, ఆ పెద్దమనిషి యుద్ధం చేసి, వంద రూపాయలు దండుకుని, వూరూ, వాడా, ఏకం చేసి పోవును."

'అమ్మో!' అనుకున్నాడు శంకరం

* ** *

ఆ రోజు ఫస్ట్ తారీఖు. జీతాలు వస్తాయి. ఏమేమి కొనాలో ముందుగా వ్రాసుకుంది కుశాలి.

సాయంత్రం- చేతిలో పేకట్టుతో చాలా హుషారుగా వచ్చాడు శంకరం. రాగానే చెప్పులు విదిలించి, పేకట్టు తీసి, అందులోంచి తళతళా మెరిసిపోతున్న చీర తీసి కుశాలి మీద కప్పాడు.

కుశాలికి సంతోషం కలిగింది. సంబరంగా అటూ ఇటూ వేసుకుని చూసుకుంది.

"ఎంతండీ చీర?"

"మూట అరవై"

"ఆ! మూట అరవయ్యా? నిజంగానా?"

"కాశ్మీరు సిల్కు చీర బేరమాడి రెండువందల అరవైది, మూటరవైకి తెచ్చాను. సంతోషించు"

"ఆహా అలాగా! ఆ కొట్టువాడు మీ మామా? మా మామా? వంద రూపాయలు తగ్గించుకుని ఇచ్చారా? ఇది కాశ్మీర్ సిల్కా, నా మొహమా? మామూలు, చౌకరకం చీరండీ బాబు ఇది. అరవై రూపాయలకి మన జానకమ్మగారే కొన్నారు. నీళ్ళల్లో పెట్టగానే ఈ తళతళలు పోయి, జాడలిచ్చేస్తుంది. హయ్యో దేవుడా- మూటరవయ్యా- పోయి ఇచ్చేసిరండి"

"వెనక్కి తీసుకోరే"- ఇద్దరి సంతోషం ఎగిరిపోగా దిగులుగా కూచుండిపోయారు.

ఆ రాత్రంతా నిద్రపట్టలేదు కుశాలికి. తెల్లవారుతుండగా ఓ నిర్ణయానికి వచ్చింది.



ఉదయం భర్తను సాగనంపి చీర పేకట్టుతో జానకమ్మగారి ఇంటికి వెళ్ళింది.

"పిన్నిగారూ- నాకు డబ్బు చాల అవసరమై ఈ చీర అమ్మేయదల్చుకున్నాను. అమ్మడం అంటే లాటరీ పద్ధతిలో.

"ఐదురూపాయలకి చీర!" మీరు మీ మహిళా మండలిలో చెప్పి మూటసాయం చేయాలి" అని

కోరింది.

కుశాలి అంటే చాల అభిమానం జానకమ్మగారికి. అన్ని సంగతులూ ఆమెకి చెప్పకుంటుంది కుశాలి. తల్లిలా అన్నీ కడుపులో పెట్టుకుంటుందామె. తల్లీ బిడ్డల్లాంటి అనుబంధం వారిది.

ఆవిడ ఏదో గ్రహించినట్లు నవ్వుతూ 'సరే'నంది. ఆ సాయంత్రం చీర పేకట్టుతో మహిళా మండలికి వెళ్ళారు. ఆమె సెక్రటరీ గనుక ఆమె మాటకి విలువుంది అక్కడ.

"ఈ చీర 5 రూపాయల్రా- లాటరీ. మీ కళ్ళ ముందే తీస్తాం'' అన్నారు జానకమ్మగారు.

అరవై మంది మెంబర్లు.

'ఓస్ ఐదురూపాయలేగదా- చూద్దాం మన లక్. చీర బాగుంది' అంటూ వెంటనే తలా ఐదు ఇచ్చేశారు.

చీటీలు వేసి ఒక పాపతో తీయించారు.

ప్రెసిడెంటు ప్రసూనాంబగారికి వచ్చింది చీర. అంతా సంతోషించారు.

డబ్బుతో ఇల్లు చేరింది కుశాలి. ఆమె మనస్సు తేలిపోతోంది. మూడు వందల రూపాయలు! భగవంతుడి దయవల్ల ఎంత సులువుగా, లాభంగా తన ఆలోచన ఫలించింది. మూడు వందలలో- నూటపదహారు రూపాయలు జానకమ్మగారికి 'బహుమతి'గా సమర్పించుకుంది, సంగతి వివరించి. ముందు ఒద్దన్నా తీసుకుందామె.

ఇద్దరూ సంతోషించారు.

* ** *

అమావాస్య రాత్రులు. శ్రావణమాసం- మబ్బులు కమ్మిన ఆకాశంలో నక్షత్రాలు కూడా లేవు. సన్నగా వర్షపుజల్లు కురుస్తోంది. ఇంట్లో కూడా ఒక మూలగా కారుతోంది. ఆ కారే చోట ఒక గిన్నె వుంచింది కుశాలి. టప్-టప్‌మని చుక్క చుక్కా పడుతూ చిరు శబ్దమౌతోంది. ఎందుకనో సరిగ్గా నిద్రపట్టడంలేదు ఆమెకి. భర్తవైపు చూసింది. చిరిగిన బనీను, లుంగీ, సగం వరకూ కప్పుకున్న పాత దుప్పటి. తెలివి తక్కువతనం తప్పిస్తే అతనెంతో మంచివాడు. కుశాలి అంటే ప్రాణం. భర్తవైపు ప్రేమగా చూస్తోంది కుశాలి. ఇంతలో-

"దొ... దొ... దొ... దొంగలు... దొంగలు'' సాంబయ్యగారి కంఠం వినిపించగానే, కుశాలి కూడా వీలైనంత గట్టిగా "దొంగలు దొంగలు'' అని అరచింది.

ఒక్క వుదుటున నిద్రలేచిన శంకరం "ఏరీ, ఎక్కడ'' అంటూ తలుపులు తీసుకుని బయటకు వురికాడు.

హఠాత్తుగా లేచి, పరిగెత్తిన భర్తని చూసి ఆ బైటవున్న దొంగలు తన భర్తని ఏం చేస్తారో అని హడలిపోయి- తక్షణం తనూ గట్టిగా అరచింది.

"ఆగండి, మీ చేతిలోని తుపాకీతో ఎవ్వర్నిబడితే వాళ్లని పిట్టల్లా కాల్చేస్తారేమో- తొందరపడకండి'' అంటూ!

ఎప్పుడైతే "తుపాకీ'' అని విన్నారో- కత్తులతో, కర్రలతో వచ్చిన నలుగురు దొంగలూ వచ్చిన దారినే పారిపోయారు. భర్తని ఇంట్లోకి లాక్కొచ్చి తలుపులు బిగించింది.'

"నాకు తుపాకీ ఎక్కడిదే- కలగన్నావా? ఎర్రి మొహమా-''

"ఛత్! ఇంక మాట్లాడకండి. వాళ్ళు మామూలు దొంగలు కారు బందిపోట్లు. జట్లు జట్లుగా ఇళ్ళమీద పడ్తున్నారీ మధ్యని, గగ్గోలు పెడ్తున్నారు గదా జనాలంతా- వినలా? పెద్ద వీరుడిలా- ఏరి? ఎక్కడ? అంటూ ఉత్తచేతుల్తో వెళ్ళిపోయారే- నేనలా అరవకపోతే- ముందు మిమ్మల్ని రెక్కలిరిసి పట్టుకుని "ఇంట్లో సమస్తం ఇస్తే గానీ వదిలిపెట్టం'' అంటారు. లేదా నిన్నో చంపి లేదా నీ ముందే నన్ను నాశనం చేసిపోయుండేవాళ్ళు- అరె మీ లుంగీ ఏది? ఓహో గజేంద్రుడ్ని రక్షించ డానికి బయల్దేరిన విష్ణుమూర్తికి పైబట్ట జారిపోయి నట్లుగా సాంబయ్యగార్ని రక్షించడానికి బయల్దేరిన మీకు లుంగీ వూడిపోయుంటుంది బైట. తెస్తా నుండండి." తలుపు తీసి బైటకెళ్ళింది కుశాలి.

"నల్లగా వున్నారండీ- మసి, జిడ్డు రాసుకుని వచ్చినట్లున్నారు. వాళ్ళల్లో ఒకడు "అరవబాకు బిడ్డా'' అంటున్నాడు నన్ను- కిటికీ అద్దం పగలగొట్టారు. అదుగో కుశాలమ్మ తల్లి అరవబట్టే వాళ్ళు పారిపోయారు-" అని పోగైన జనంతో చెపుతున్నాడు సాంబయ్యగారు.

క్రింద పడిన తెల్ల లుంగీ తీసుకుని లోపలకొచ్చిందామె. నిక్కర్‌తో అలాగే నించున్న అతను అదందుకుని కట్టుకున్నాడు.

భార్యని దగ్గరకు తీసుకుని- "నా కుశాలీ- నీది నిజంగా కుశాగ్రబుద్ధే! నీవే నా భార్యవి కాకుంటే నా జీవితం ఏమైవుండేదో-'' అంటూ ఆమెని హృదయానికి హత్తుకున్నాడు. ●




## రడ్‌యార్డ్ కిప్లింగ్ వ్యాఖ్యపై వచ్చిన కథలు

శ్రీ బీయార్ —చిదంబర రహస్యం
శ్రీ ఆర్.వి.రమణప్రసాద్ 'వల'
శ్రీ విరించి 'అకారణం'
శ్రీమతి ఎం.విద్యుల్లత 'ఓహ్హో! నా పెళ్ళామా'
శ్రీమతి భాగవతుల లలిత శర్మ '(అ) సావేరి'
శ్రీ వెల్చేరు చంద్రశేఖర్ 'క్లెవర్ గర్ల్'
శ్రీమతి కొవ్వలి నాగేశ్వరి 'ఆకూ-వక్క'
శ్రీమతి నెల్లూరి పార్వతీదేవి 'ఇల్లుపట్టిన శని'
శ్రీ ఎస్. జగన్ మాధవరావు 'తెలివైన అర్ధాంగి'

ఈ మొత్తం తొమ్మిది కథలలో ఏది ఉత్తమమైనది నిర్ణయించే బాధ్యత పాఠకులదే. ఈ కథలను 17-1-86 సంచిక నుంచి ప్రచురిస్తున్నాము.

పాఠకులు కూపన్‌లో నాకు నచ్చిన కథ 'పేరును' వ్రాసి పంపితే ఎక్కువ ఓట్లు వచ్చిన రెండు కథలకు 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ గారి రచనలు ఇప్పటి వరకూ లభ్యమైనవి చెరి ఒక సెట్ బహూకరిస్తాము. పాఠకులు 9 కథలను వరుసగా చదవాలి. 9 వ కథ ప్రకటించిన వారం రోజుల వరకు పాఠకులు తమ ఓట్లను పోస్ట్ కార్డుల ద్వారా కూడా తెలియపరచ వచ్చును.

—ఎడిటర్

### నాకు నచ్చిన కథ కూపన్

కథ పేరు ------------------------
పంపిన వారి పేరు ------------------
చిరునామా ----------------------
-----------------------------

(సంతకం)